www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి





EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:49 TUESDAY ,JUNE 30,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 49 మంగళవారం 30 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-


# ధైర్యముంటే చర్చకు రండి..

## విపక్షాలకు రేవంత్ బహిరంగ సవాల్

- బీఆర్ఎస్, బీజేపీలకు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్
- అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పాలన పై చర్చిద్దామని పిలుపు
- తమ రెండేళ్లన్నర పాలనతో బీఆర్ఎస్, బీజేపీల పాలనను పోల్చుదామన్న సీఎం
- ప్రతిపక్షాలు స్పీకర్‌కు లేఖ ఇస్తే సమావేశానికి సిద్ధమని వెల్లడి



జూన్ 29 హంసకలం వార్త

తెలంగాణలో తమ ప్రభుత్వ పాలన పై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్,బీజేపీలతో చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.ఇందు కోసం శాసనసభ, శాసనమండలిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నల్గొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ఈ సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ రెండేళ్లన్నర పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు కేంద్రంలోని బీజేపీ 12 ఏళ్ల పాలనతో పోల్చి చూసేందుకు సిద్ధమని రేవంత్ రెడ్డి వెల్లడించారు. -మిగతా2లో

# వీబీ జీ రామ్ జీ పథకం పై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క



2

- జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క
- కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రం పైనే పడుతుందని వ్యాఖ్య
- పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం

# రియల్ లైఫ్ ‘బ్యాట్‌మ్యాన్‘.. దొంగలను వేటాడి, స్తంభాలకు కట్టేస్తున్న ముసుగు వీరుడు!

జూన్ 29 హంసకలం వార్త

సినిమాల్లో ముసుగు వేసుకుని వచ్చి నేరస్థులను నడిరోడ్డుపై శిక్షించే ‘బ్యాట్‌మ్యాన్‘ పాత్రను మనం చూసే ఉంటాం. ఇప్పుడు సరిగ్గా అలాంటి వరుస ఘటనలే మెక్సికోలో నిజంగా జరుగుతున్నాయి. బైక్ దొంగతనాలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న దొంగలను వేటాడి, వారిని నడిరోడ్డు పై కరెంట్ స్తంభాలకు -మిగతా2లో




# హోర్ముజ్ జలసంధి వివాదం.. ఆర్టికల్-5 ఏం చెబుతోంది

జూన్ 29 హంసకలం వార్త

ఇరాన్-అమెరికా మధ్య ఇటీవల కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పందంలోని ఆర్టికల్-5 అమలు పై భిన్న వాదనలు వినిపిస్తుండటంతో హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు మరలా పెరిగాయి. వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణ అంశమే ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. జూన్ 17న అమెరికా అధ్యక్షుడు -మిగతా2లో



# ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి: సీఎం చంద్రబాబు



2

- అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలన్న సీఎం
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం
- రూ.50,999 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- ప్రతి రెండు నెలలకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష జరుపుతామన్న చంద్రబాబు
- అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు ఐకానిక్‌గా ఉండాలని సూచన

# ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి: నారా లోకేశ్

జూన్ 29 హంసకలం వార్త

వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలన్నదే తన లక్ష్యమని, ఈ మార్పునకు ‘షైనింగ్ స్టార్లే’ బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ విద్యా నమూనా గురించే మాట్లాడుకోవాలని ఆకాంక్షించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ‘షైనింగ్ స్టార్స్’ పేరుతో ఘనంగా -మిగతా2లో



# ‘సర్‘ జాబితాలో పేరు లేదని.. జైలుకు పంపుతారనే భయంతో ఓ వ్యక్తి ఆత్మహత్య

- హైదరాబాద్ బోరబండ ప్రాంతంలో విషాదం
- పాస్‌పోర్ట్ తో పాటు ఇతర ప్రభుత్వ ఐడెంటిటీ కార్డుల్లో తప్పుగా ఉన్న పేరు
- సర్ జాబితాలోని పేరుతో సరిపోని డాక్యుమెంట్లు
- భయంతో ఆత్మహత్య చేసుకున్న కారు డ్రైవర్ ముజిబుర్




2

## వీబీ జీ రామ్ జీ పథకం పై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క

వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

## 'సర్' జాబితాలో పేరు లేదని.. జైలుకు పంపుతారనే భయంతో ఓ వ్యక్తి ఆత్మహత్య

హైదరాబాద్‌లో ఒక అత్యంత హృదయవిదారకమైన సంఘటన చోటు చేసుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల సవరణ కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ.. ఒక సామాన్యుడి ప్రాణం తీసింది. 'సర్' లిస్ట్‌లో తన పేరు లేకపోవడంతో, తనను జైలుకు పంపుతారనే భయంతో బోరబండ ఏరియాలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోరబండ ప్రాంతంలోని భరత్‌నగర్ నివాసి అయిన షేక్ ముజిబుర్ రహ్మాన్ (51) ఒక సాధారణ కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందులో ఇద్దరు పిల్లలు మానసిక వికలాంగులు. అయితే ముజిబుర్ పేరు పాస్‌పోర్ట్ తో పాటు ఇతర ప్రభుత్వ ఐడెంటిటీ కార్డులలో తప్పుగా పడటంతో... వాటిని సరిచేసుకోవడానికి ఏజెంట్ల చుట్టూ తిరుగుతూ ఇప్పటికే భారీగా ఖర్చు చేసి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం ప్రక్రియలో తన డాక్యుమెంట్లు సరిపోలడం లేదని, సర్ జాబితాలో తన పేరు లేదని ముజిబుర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. లిస్ట్‌లో పేరు లేకపోతే పోలీసులు వచ్చి తనను జైలుకు పంపుతారని... అదే జరిగితే తన ఇద్దరు దివ్యాంగ పిల్లలను, కుటుంబాన్ని ఎవరు చూసుకుంటారంటూ భార్య వద్ద నిత్యం ఆవేదన చెందేవాడు. భార్య ఎంత ధైర్యం చెప్పినా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాల వల్ల అతడిలో భయం పోలేదు. ఈ తీవ్ర మానసిక ఒత్తిడి భరించలేక ముజిబుర్ తన ఇంటి బయట ఉన్న షెడ్డు ఇనుప రాడ్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిజంగానే 'సర్' భయంతోనే చనిపోయాడా లేక ఇతర ఆర్థిక, ఆరోగ్య కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి: సీఎం చంద్రబాబు

దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము ఒక బ్రాండ్‌ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో రూ. 50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధైర్యముంటే చర్చకు రండి.. విపక్షాలకు రేవంత్ బహిరంగ సవాల్

తెలంగాణలో తమ ప్రభుత్వ పాలన పై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం శాసన సభ, శాసనమండలిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నల్గొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ఈ సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ రెండేళ్లన్నర పాలనను, బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు కేంద్రంలోని బీజేపీ 12 ఏళ్ల పాలనతో పోల్చి చూసేందుకు సిద్ధమని రేవంత్ రెడ్డి వెల్లడించారు. పార్టీల మేనిఫెస్టోల పై కూడా చర్చకు రావాలని ఆయన ప్రతిపక్షాలను ఆహ్వానించారు. చర్చకు సిద్ధమైతే స్పీకర్, మండలి ఛైర్మన్‌లకు ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతల పై, ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ వంటి అంశాల్లో జరిగిన జాప్యాన్ని ఆయన ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు గృహవసతి కల్పిస్తోందని, సన్న బియ్యం పంపిణీ చేస్తోందని వివరించారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# హోర్ముజ్ జలసంధి వివాదం.. ఆర్టికల్-5 ఏం చెబుతోంది

దీంతోపాటు ఆంక్షల ఉపశమనం, అణు కార్యక్రమం వంటి కీలక అంశాల పై ముందడుగు వేయాలి. అయితే.. అగ్రిమెంట్ అమల్లోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి జరిగిందని, ప్రతిగా అమెరికా చర్యలకు దిగిందని స్థానిక మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఘటన అనంతరం ఇరుపక్షాలు ఒకరి పై ఒకరు ఆర్టికల్-5 ఉల్లంఘన ఆరోపణలు చేసుకుంటున్నాయి.

**ఆర్టికల్-5లో ఏముందంటే?**

ఆర్టికల్-5 ప్రకారం హోర్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకలు సురక్షితంగా, తాత్కాలికంగా 60 రోజులపాటు ఎలాంటి రుసుములు లేకుండా ప్రయాణించేందుకు ఇరాన్ చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అలాగే 30 రోజుల్లో సాంకేతిక అడ్డంకులు, సైనిక మైన్లను తొలగించాలని కూడా సూచించింది. దీంతో పాటు ఒమన్‌తో చర్చలు జరిపి భవిష్యత్తులో సముద్ర మార్గ నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని కూడా ఈ ఒప్పందం పేర్కొంటోంది. అయితే.. అమెరికా, యూఏఈ హోర్ముజ్‌ను అంతర్జాతీయ వాణిజ్య మార్గంగా స్వేచ్ఛగా ఉంచాలని కోరుతున్నాయి. కానీ ఇరాన్ మాత్రం ఒప్పందం ప్రకారం.. భద్రతా ఏర్పాట్లు తాత్కాలికంగా తమ నియంత్రణలోనే ఉండాలని వాదిస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కూడా దీనిని సమర్థించారు. అయితే.. అమెరికా దీనికి ససేమిరా అంటుండటంతో నౌకా మార్గం, నియంత్రణపై విభేదాలు తలెత్తాయి. కాగా.. ఒప్పందంలోని నిబంధనలను అమెరికా కొత్తగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని, ఇరాన్ మాత్రం తన నియంత్రణను కొనసాగించాలని పట్టుబడుతోందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విభేదాలే తాజా ఉద్రిక్తతలకు కారణమని వారు చెబుతున్నారు. ప్రపంచ చమురు సరఫరాలో సింహభాగం హోర్ముజ్ జలసంధి మార్గంలోనే వెళ్తున్నందున.. అక్కడ ఏ చిన్న ఉద్రిక్తత నెలకొన్నా అంతర్జాతీయంగా ప్రభావం చూపే అవకాశముంది.

## రియల్ లైఫ్ 'బ్యాట్‌మ్యాన్'.. దొంగలను వేటాడి, స్తంభాలకు కట్టేస్తున్న ముసుగు వీరుడు!

సోషల్ మీడియాలో అతడిని నెటిజన్లు 'మెక్సికన్ బ్యాట్‌మ్యాన్', 'బ్యాట్‌మ్యాన్ ఆఫ్ లాగోస్ డి మోరెనో' అని పిలుస్తున్నారు. అయితే, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ఈ ముసుగు వీరుడిని పట్టుకోవడానికి స్థానిక పోలీసులు పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. మెక్సికోలోని జలిస్కో రాష్ట్రంలో ఉన్న లాగోస్ డి మోరెనో మున్సిపాలిటీలో జూన్ 13 నుంచి ఈ విచిత్ర సంఘటనలు మొదలయ్యాయి. కేవలం 10 రోజుల వ్యవధిలోనే ఇలాంటివి కనీసం ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ 'బ్యాట్‌మ్యాన్' అర్ధరాత్రి వేళల్లో ఒంటరిగా తిరుగుతూ బైక్ దొంగలను పట్టుకుంటున్నాడు. వారిని చితకబాది, రోడ్డు పక్కన ఉండే విద్యుత్ స్తంభాలకు డక్ టేపులతో కదలకుండా కట్టేస్తున్నాడు. అంతటితో ఆగకుండా వారు దొంగిలించిన బైక్‌లను కూడా వారి పక్కనే ఉంచేసి వెళ్తున్నాడు. అంతేకాదు, ఆ దొంగల ముఖాలపై స్కెచ్ పెన్నులతో పిల్లి మీసాలు, గడ్డాలు గీసి, వారి నుదిటిపై స్పానిష్ భాషలో 'రటెరో'(దొంగ) అని రాస్తున్నాడు. ఒక ఘటనలోనైతే ఇద్దరు దొంగలను కలిపి ఒకే స్తంభానికి కట్టేసి, వారి తలపైన గులాబీ రంగులో ఓ వార్నింగ్ బోర్డ్ కూడా పెట్టాడు.

**రంగంలోకి దిగిన పోలీసులు**

ఈ ఘటనలపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్తంభాలకు ఉన్న దొంగలను విడిపించి, గాయాలైన వారికి చికిత్స అందిస్తున్నారు. అయితే, చట్టప్రకారం పోలీసులు వీరిని దొంగలుగా కాకుండా.. దాడికి గురైన బాధితులుగా పరిగణిస్తుండటం గమనార్హం. స్థానిక భద్రతా కార్యదర్శి జువాన్ పాబ్లో హెర్నాండెజ్ మాట్లాడుతూ.. ఈ దాడులకు పాల్పడుతున్న వ్యక్తి కోసం తాము ముమ్మరంగా గాలిస్తున్నామని తెలిపారు. ఈ దాడులకు ఉపయోగించిన రెండు వాహనాలను ఇప్పటికే గుర్తించామని, ఇది ఒకే వ్యక్తి చేస్తున్న పనా లేక ఏదైనా గ్రూప్ చేస్తోందా అనే కోణంలో విచారణ చేపట్టామని చెప్పారు.

**నెటిజన్ల ప్రశంసలు.. హక్కుల సంఘాల ఆందోళన**

లాగోస్ డి మోరెనో ప్రాంతంలో ఇటీవల కాలంలో మోటార్ సైకిల్ దొంగతనాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో విసిగిపోయిన స్థానిక ప్రజలు, నెటిజన్లు ఈ 'మెక్సికన్ బ్యాట్‌మ్యాన్' చర్యలను టిక్‌టాక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తెగ పొగిడేస్తున్నారు. 'పోలీసులు చేయలేని పనిని అతడు చేస్తున్నాడు' అంటూ కామెంట్లు పెడుతున్నారు. కానీ, మానవ హక్కుల సంఘాలు మాత్రం ఇలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నాయి. నేరస్థులైనా సరే, ఇలా సొంతంగా శిక్షలు వేయడం వల్ల సమాజంలో హింస మరింత పెరుగుతుందని, ఇది న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసినట్టవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి: నారా లోకేశ్

వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలన్నదే తన లక్ష్యమని, ఈ మార్పునకు 'షైనింగ్ స్టార్లే' బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ విద్యా నమూనా గురించే మాట్లాడుకోవాలని ఆకాంక్షించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'షైనింగ్ స్టార్స్' పేరుతో ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ టాపర్లు 55 మందికి రూ. 30 వేల నగదు బహుమతి, ఇంటర్ టాపర్లు 61 మందికి ల్యాప్‌టాప్‌లు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "నిద్రలో కనిపించేది కల కాదు, మిమ్మల్ని నిద్రపోనివ్వనిదే నిజమైన కల. నిద్రపోకుండా మీరు పడిన కష్టమే మిమ్మల్ని షైనింగ్ స్టార్స్‌గా నిలబెట్టింది. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు, మన విద్యావ్యవస్థను గెలిపించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీ పనితీరు వల్ల మంత్రిగా నాకు, 2 లక్షల మంది ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది" అని విద్యార్థులను ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సులు అడిగే రోజులు వచ్చాయని, మంగళగిరిలో ఒక తల్లి తనను నిడమర్రు స్కూలులో సీటు ఇప్పించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

**విద్యారంగంలో సమూల మార్పులు**

విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన లోకేశ్, ఫలితాలు వెంటనే రావని, నిరంతరం శ్రమిస్తేనే పంట చేతికొచ్చిన ఆనందం దక్కుతుందని అన్నారు. విద్యార్థులను కేంద్రంగా చేసుకుని అనేక సంస్కరణలు చేపట్టామని వివరించారు. "గతంలో పాఠ్యపుస్తకాలపై ముఖ్యమంత్రి, మంత్రుల బొమ్మలుండేవి. నాకు ఆ ఫోటో పిచ్చి లేదు. అందుకే బ్యాగ్‌పై, బెల్ట్‌పై, గుడ్డపై, స్కూలులో ఎక్కడా బొమ్మలు లేకుండా చేశాం. పాఠశాలల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశాం" అని తెలిపారు. 'వన్ క్లాస్-వన్ టీచర్', డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్, డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి భోజన నాణ్యతను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని తెలిపారు.

**విలువలకే పెద్దపీట**

విలువలు లేని సమాజం ప్రమాదకరమని, అందుకే నైతిక విలువల కోసం చాగంటి కోటేశ్వరరావు గారిని సలహాదారుగా నియమించామని లోకేశ్ పేర్కొన్నారు. "అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అనే ఆయన మాట చాలా శక్తివంతమైనది. మహిళలను గౌరవించడం ఇంటి నుంచే మొదలుకావాలి. తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ఆ మార్పునకు శ్రీకారం చుట్టాం" అని చెప్పారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కలలు కనడంతో పాటు, రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని మార్చే నాయకులుగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు.

**ఓటమి నుంచే పాఠాలు నేర్చుకోవాలి**

తన రాజకీయ జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. "2019లో ఇదే మంగళగిరి నియోజకవర్గంలో ఓడిపోయినప్పుడు బాధ కలిగినా, పట్టుదలతో ఐదేళ్లు పనిచేసి 91 వేల మెజారిటీతో గెలిచాను. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయొద్దు. ఫెయిల్ అంటే ఫస్ట్ ఎటెంప్ట్ ఇన్ లెర్నింగ్ అని గుర్తుంచుకోండి" అని సూచించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తోందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. చదువు పూర్తయ్యాక, అవకాశం వచ్చినప్పుడు సొంత పాఠశాలకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారీయా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.


# దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్

జూన్ 29 హంసకలం వార్త

పెన్ను పట్టిన, వీడియో కెమెరా పట్టి తమ విధు లు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహి స్తున్నా వారందరు జర్నలిస్ట్ లిస్టులే. సుప్రీం కోర్ట్ ఇక పై కావాలనే కక్ష్యతో రాజకీయ నాయకులు, అక్రమ సంపాదన దందాలు చేసే వారు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతల పై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్‌ల పై అక్రమ కేసులు చెల్లనేరావు:సుప్రీం కోర్ట్ శాటిలైట్ ఛానెల్స్, యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్, ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజనిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుం దని, వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళ పై, అట్టి పోలీస్ లపై వేట తప్పదు అన్న సుప్రీం కోర్ట్.

# సంపాదకీయం

## అత్యాశతోనే సైబర్ ఉచ్చులోకి..!




ఎన్సీఆర్బీ నివేదిక--2024 ప్రకారం దేశవ్యాప్తంగా 1,01,928 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. 2023లోని 86,420 కేసులతో పోలిస్తే ఇది సుమారు 17శాతం వరకు పెరిగింది. ప్రతి లక్ష జనాభాకు సైబర్ నేరాల రేటు 6.2 నుంచి 7.3కి పెరిగింది. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 27,230 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక (21,993 కేసులు), ఉత్తరప్రదేశ్ (11,073 కేసులు) నిలిచాయి. మహారాష్ట్రలో 9,922 కేసులు, బిహార్‌లో 6,380 కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2,528 సైబర్ నేరాల కేసులు నమోదై దేశంలో 8వ స్థానంలో నిలిచింది. ఒంటరి మహిళలు, కుటుంబానికి దూరంగా ఉంటున్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒంటరితనం అవకాశంగా చేసుకుని అపరిచితులుగా పరిచయం అవుతున్నారు. వారికి మాయ మాటలు చెప్పి దగ్గరై, అందినకాడికి డబ్బులు లాగేసి ముఖం చాటేస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో బాధితులు ఒంటరిగా మిగిలిపోతున్నారు. పరువుకు సంబంధించిన విషయం కావడంతో చివరకు తమ బాధను బంధువులకు, దగ్గర వాళ్లకు చెప్పలేని పరిస్థితి. కరోనా తరువాత ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయి. ఎక్కువ మంది యువత ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్ లకు అలవాటై చిన్నతనంలోనే జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. నిండా 25ఏళ్లు నిండకుండానే జీవితాలు అర్ధాంతరంగా ముగించేస్తున్నారు. ఈ మధ్య డిజిటల్ అరెస్టులు ఎక్కువయ్యాయి. తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి మీకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయి, మీ చిరునామాతో డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని చెప్పి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. బాధితులు భయపడి సైబర్ మోసగాళ్ల వలలో పడుతున్నారు. సైబర్ నేరాలు అరికట్టడంలో మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్ కొంత పురోగతి సాధించింది. ఆన్‌లైన్ మోసగాళ్ల నుంచి ఈ ఏడాది దాదాపు రూ.247 కోట్ల మొత్తాన్ని రికవరీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. సైబర్ మోసాలు రోజురోజుకు కొత్త అవతారాలు ఎత్తడంతో 'ఏపీ సైబర్ గార్డ్'లో భాగంగా 6 పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్స్, ఫేక్ యాప్స్, ఫిషింగ్ లింకులు, డిజిటల్ అరెస్టులు వంటి నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టి సైబర్ నేరాలు అరికడుతున్నారు. అయినా రోజూ ఎక్కడో ఒక చోట సైబర్ మోసాలు జరుగుతూ ఉండటం బాధాకరం. ఇప్పటికైనా యువత, ఉన్నత విద్యావంతులు కళ్లు తెరవాలి. అత్యాశకు పోయి ఉన్న డబ్బులు పోగొట్టుకోకుండా చూసుకోవాలి. అపరిచితులు నుంచి ఫోన్ కాల్స్ లేదా ఈ మెయిల్ వస్తే నేషనల్ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి వెంటనే ఫోన్ చేసి జరిగిన విషయం వివరించాలి. ఒక వేళ డిజిటల్ అరెస్ట్ అయితే వెంటనే నిర్భయంగా పోలీసులకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాలి.

# సమైక్యతా మార్గంలోనే వికసిత భారత్



'భారతదేశం అంతటి గొప్ప దేశం మరొకటి ఉండదు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, యాసలు, ఆచారాలతో ఎంతో విభిన్నమైన మనుషులను ఏకతాటిపైకి తెచ్చింది మన దేశం. భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప భావనకు మించింది ఏముంటుంది?' -- ఇవి జూన్ 15న ఢిల్లీలో 'జాతీయ సమైక్యత కోసం... సేన ప్రస్థానం' సమావేశం నిర్వహించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌గారు చేసిన వ్యాఖ్యలు. "నేను ప్రతీసారీ ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అని ఎందుకు అంటానంటే మన మొదటి ప్రాధాన్యం దేశం అవ్వాలి. తర్వాతే ప్రాంతం. అయితే కొన్ని దశాబ్దాలుగా ఈ స్ఫూర్తి మెల్లగా తగ్గుతోంది. ఇది చాలా ప్రమాదకరం" అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వం, ప్రాంతీయతత్వం, కులతత్వం, భాషా దురభిమానం పెరిగిపోతున్న నేటి రోజుల్లో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల వెనుక ఆవేదనను అర్థం చేసుకోవచ్చు.

నిజానికి ఇన్ని విభిన్న కులాలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు ఉన్న దేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఇన్ని వైవిధ్యాలు ఉన్నా కూడా ఒక దేశంగా మనం ఉన్నామంటే కారణం మనలోని భిన్నత్వంలోని ఏకత్వ ?స్ఫూర్తే! భారతదేశం అంటే కేవలం భూభాగం కాదు, అది 140 కోట్ల ప్రజల గుండె చప్పుడు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి నాగాలాండ్ వరకు– భిన్నత్వమే మన బలం. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత్‌లో 565 సంస్థానాలు ఉండేవి. ఇవి ప్రత్యేక దేశాలుగా మారితే భారత్ ముక్కలవుతుందని గ్రహించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ రెండేళ్లలో అన్నింటినీ భారత్‌లో విలీనమయ్యేలా కృషి చేశారు. అందుకనే ఆయన్ను భారత సమైక్యతా శిల్పి అని గౌరవించుకుంటాం. జాతీయ సమగ్రత పట్ల, సుపరిపాలన పట్ల, ప్రజాసేవ పట్ల ఆయన అచంచల నిబద్ధత భావి తరాల వారికి స్ఫూర్తిదాయకం. భారత రాజ్యాంగం జాతీయ సమైక్యతకు ప్రాధాన్యమిచ్చి భారతదేశాన్ని ఒక సర్వసత్తాక, సామ్యవాదం, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. అయితే ఈ మధ్య కాలంలో 'భారతదేశం నా మాతృ భూమి, భారతీయులందరూ నా సహోదరులు' అన్న ప్రతిజ్ఞ నోటిమాటగానే మిగిలిపోతున్నది. భారతావనికి మూలమైన భిన్నత్వంలో ఏకత్వ భావన బీటలు వారుతుంది. భాష, యాస, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత విశ్వాసాలు, ప్రాంతాల ఆధారంగా తోటి భారతీయులను చిన్నచూపు చూస్తూ అపహాస్యం చేసే వికృత ధోరణి పెరిగిపోతుంది. జాతీయ సమైక్యత, సమగ్రతలను అవి ప్రమాదంలో పడేస్తున్నాయి.

కులాభిమానం పేరుతో ఇతర కులాలను తక్కువ చేసి మాట్లాడడం, మతాన్ని రాజకీయంగా వాడుకోవడం, ప్రాంతీయాభిమానం ముసుగులో ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిలించడం, ఒక భాషపైన, యాస పైన అతి ప్రేమ, అభిమానం చూపిస్తూ ఇతర భాషల్ని తక్కువగా చేసి మాట్లాడడం నేడు చూస్తున్నాం. వసుధైక కుటుంబంగా ఉండాల్సిన మన దేశంలో... దేశాన్ని బలహీనపరిచే "మా రాష్ట్రం, మా ప్రజలు, మా భాష, మా నీళ్లు" అనే సంకుచితత్వాన్ని కొందరు నాయకులే పెంచి పోషిస్తున్నారు. ఈ అతి తత్వాలు దేశ సమగ్రతకు ముప్పుగా మారుతున్నాయి. మరోవైపు దేశాన్ని అస్థిరపరిచడమే ఏకైక లక్ష్యంగా పనిచేసే 'సీమాంతర ఉగ్రవాదం' మన జాతీయ సమగ్రతకు పెను సవాలుగా మారుతోంది. కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల సాధన కోసం నేరస్తులతో సంబంధాలను కొనసాగిస్తూ, దేశ సమగ్రతకు విఘాతం కలిగిస్తున్నారు. ఈ విషయాన్ని వోహ్రా కమిషన్ ఆధారాలతో సహా రుజువు చేసింది.

విభజన వాదులతో జాతి సమైక్యతకు వాటిల్లిన ముప్పు నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత నేటి యువత పైనే ఉంది. సమాజంలో మార్పు కోరుకుంటే రాదు– ప్రయత్నిస్తేనే వస్తుందని యువత తెలుసుకోవాలి. "మా సమస్యకి వేరెవరో కారణం, ఎవరో నష్టపోతేనే మేము ప్రయోజనం పొందగలము" అనే ధోరణి అనాగరిక ప్రజాస్వామ్య సంస్కృతే తప్ప, ఆధునిక ప్రజాస్వామ్యం అనిపించుకోదని గ్రహించాలి. ఇక్కడ "నేను తెలుగువాడిని", "నేను తెలంగాణవాడిని" అనే భావన కంటే "నేను భారతీయుడిని" అనే భావన గొప్పది కావాలి. వేరే ప్రాంతం వారనో, వేరే భాష మాట్లాడుతున్నారనో, చూడడానికి భిన్నంగా కనిపిస్తున్నారనో సాటి భారతీయుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తే– భారత జాతీయతను అవమానించినట్లే!

విపరీతమైన ప్రాంతీయతత్వం దేశ సమైక్యతకు భంగం కలిగిస్తుంది. భారత్‌ను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి బ్రిటిష్‌వారు 'విభజించు, పాలించు' సూత్రానికి అనుగుణంగా ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించడమే భారత్ -- పాకిస్థాన్ విడిపోవడానికి దారితీసింది. మరోసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా యువత అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రాల సమాహారమైన మన దేశంలో ఎక్కడివారైనా, ఎక్కడికైనా వెళ్లి, స్థిరపడి, శాంతియుతంగా పనిచేసుకోవచ్చని రాజ్యాంగం స్పష్టం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి ఉండడం భారతీయులందరి కర్తవ్యం.

ఏ దేశానికైనా బలం ఆ దేశ ఐక్యతే! ఏ దేశాభివృద్ధి అయినా అక్కడి ప్రజల ఐక్యతతోనే సాధ్యమవుతుంది. జాతీయ సమగ్రత అనేది వివిధ రకాల పువ్వులతో కట్టిన దండ లాంటిది. ప్రతి పువ్వు రంగు, వాసన వేరు. కానీ దారం ఒక్కటే. ఆ దారం తెగితే దండ విడిపోతుంది. ఆ దారమే "భారతీయత".

# 'ఆద్యకళ' మ్యూజియాన్ని అడ్డుకోవద్దు

ప్రజల కళలను, అపురూప సాంస్కృతిక రూపాలను, భాష, సాహిత్యాల చిహ్నాలను, కళాఖండాలను పరిరక్షించడం వ్యవస్థల బాధ్యత. ప్రభుత్వ, ప్రభుత్వాధీన సంస్థలు ఈ విషయంలో ముందుకు వచ్చి వాటిని భవిష్యత్ తరాలకి అందించాల్సిన అవసరం ఉంది.

ప్రజలు సృష్టించిన కళలు, సంగీత వాద్యాలను, ప్రదర్శనలను చిన్నచూపు చూడడం వల్ల అవి అంతరించిపోతున్నాయి. వాటిని కాపాడాలనే ధ్యాసలేని సంస్థలు వాటి బాధ్యతను విస్మరించినట్లే. ప్రజలకు సంబంధించిన సంస్కృతిని చూస్తూ చూస్తూ పట్టించుకోకపోవడం నేరంగానే భావించాలి. దీనిని గమనించిన అలనాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు తెలుగు విశ్వవిద్యాలయాన్ని 1985లో హైదరాబాదులోని నాంపల్లిలో ఏర్పాటు చేశారు. తెలుగు భాష, సాహిత్యం, సాంస్కృతిక రంగంలో ఉన్నతస్థాయి పరిశోధనా కేంద్రంగా పనిచేయాలని లక్ష్యంగా ఏర్పాటు చేశారు. పై అంశాలకు సంబంధించిన విషయాలపై అధ్యయనం జరగాలని ఆశించారు. కాని ఇప్పుడు ఆ అంశం పక్కనపడి సర్టిఫికెట్ కోర్సుల స్థాయికి చేరింది.

తెలుగు భాషా సాహిత్యాలు వివిధ జానపద అంశాలపై వివిధ రాష్ట్రాలలో ఉన్నవారికి, విదేశాలలో ఉన్న తెలుగువారికి శిక్షణ గరపడం విశ్వవిద్యాలయం లక్ష్యం. అంతేకాదు, తెలుగు ప్రజల సంస్కృతి కోసం చిత్రాలు, శిల్పం, సంగీతం, కళలకు సంబంధించిన మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. కాని కేవలం అది ఒక్క హాలుకే పరిమితమైంది. సుమారు నలభై ఏళ్ల నుంచి అదనంగా ఏ ఒక్క కళాఖండం కూడా సేకరణ కాలేదు. తెలుగు విశ్వవిద్యాలయం మొదటి దఫా అధ్యాపకునిగా ఎంపికైన ప్రొ. జయధీర్ తిరుమలరావు ఆ పనిని తన భుజాలకెత్తుకున్నారు. ఆనాటి నుంచి ఈనాటి దాక తన ఏభై ఏళ్ల కాలాన్ని వస్తు సేకరణకే అంకితం చేశారు. అలా సుమారు ఎక్కడా చూడని, వినని సంగీత వాద్యాలని, పెయింటింగ్స్‌ని, తాళపత్ర గ్రంథాలు, పాత కాగితం రాతప్రతుల్ని, కాగితం చుట్టలని ఆరు మ్యూజియం లకి సంబంధించిన కళాఖండాలను సేకరించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ సామాగ్రిని పెట్టుకోవడానికి ఖాళీగా ఉన్న తెలుగు విశ్వవిద్యాలయంలోని కొన్ని గదులను ఇచ్చింది. ఆ గదులలో పట్టని అతి పెద్ద పడవలు, పులిబోనులు, బండ్లు, రథాలను బయటే ఉంచారు. అవి పాడుకాక ముందే ఒక గూడు చూపించమని ఎక్కని గడప, దిగనిమెట్టు లేదు.

గత ఉపాధ్యక్షులు నాంపల్లి బిల్డింగ్ చిన్నదైనదని, విశాలమైన కేంపస్ ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు స్పందించిన ప్రభుత్వం బాచుపల్లిలో వంద ఎకరాల స్థలంలో పర్మనెంట్ బిల్డింగులు కట్టించి విశ్వవిద్యాలయాన్ని అక్కడకు తరలించింది. అంత పెద్ద కేంపస్‌లో తెలుగు భాషా సంస్కృతుల మ్యూజియం ఏర్పాటు చేయాలన్న సంకల్పం ఏ వీసీకీ కలగలేదు. ఆచార్య తంగెడ కిషన్‌రావు వీసీగా ఉన్న కాలంలో ఈ విషయాన్ని అర్థం చేసుకుని 'ఆద్యకళ' మ్యూజియం వస్తువులు భద్రపరచుకోవడం కోసం కొన్ని గదులు కేటాయించారు. కానీ ప్రస్తుత ఉపాధ్యక్షులు వాటిని ఖాళీ చేయాలన్నారు. చివరికి ప్రభుత్వ పెద్దల జోక్యంతో వాటిని అక్కడే ఉంచారు. నిజానికి విశ్వవిద్యాలయం బాచుపల్లికి తరలిపోయినప్పుడు లేదా తరువాతనైనా నాంపల్లి లోని భవనాలను ప్రభుత్వానికి అప్పగించాలి. కాని అలా జరగలేదు. బయటనున్న ఇతర శాఖ కార్యాలయాలకు అద్దెకు ఇచ్చారు. విశ్వవిద్యాలయం అవసరాలకు, తెలుగు భాషా సంస్కృతి, కళలకు కేంద్రంగా ఉండాల్సిన భవనాలలో వీటికి సంబంధంలేని ఇతర సంస్థల కార్యాలయాలకు ఇచ్చారు. 'ఆద్యకళ' మ్యూజియం సందర్శించిన ప్రభుత్వ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసిన కమిటీలు ఆది ధ్వని ఫౌండేషన్‌కు ఇవ్వడానికి సిఫారసు చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి, సాంస్కృతిక శాఖ మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. తెలుగుభాషా సంస్కృతులు, కళలు, ప్రదర్శనలు ముఖ్యంగా లోకానికి తెలియని అపురూప ప్రదర్శనలు, సంగీతాలకు కాణాచి అయిన 'ఆద్యకళ' మ్యూజియం ఏర్పాటుకు గ్రౌండ్‌ఫ్లోర్ మాత్రమే ఇవ్వాలని జీవో ఇచ్చారు. మిగిలిన మొదటి, రెండవ అంతస్తులను విశ్వవిద్యాలయం అవసరాలకు వాడుకోవడానికి అంగీకరించారు. కానీ వీసీ, రిజిస్ట్రార్‌లు వారి ఛాంబర్‌లను ఇంకా ఇక్కడే ఉంచుకున్నారు. దశాబ్దాల క్రితం అచ్చేసిన పుస్తకాలను విక్రయించకుండా పెద్దపెద్ద హాళ్లను గోడౌన్లుగా అలాగే ఉంచారు.

ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయకుండా అధికారులు... బయట నుంచి విద్యార్థి సంఘాలతో గొడవలు పెట్టడం విచిత్రం. 'ఆద్యకళ' మ్యూజియం ఏర్పాటు చేయకుండా అడ్డుకొని ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే విధంగా పావులు కదుపుతున్నారు. విశ్వవిద్యాలయం చేయవలసిన పని ఎవరో ఒకరు చేబూనితే వారికి సహకరించాల్సింది పోయి విఘాతం కలిగించడం సరికాదు. ఎన్టీఆర్ ఇప్పుడు బతికివుంటే రోడ్డు మీద ధర్నా చేసేవారనిపిస్తోంది. లోగడ వరంగల్‌లో గిరిజన జానపద విజ్ఞానపీఠం ఏర్పాటు చేశారు. ఆ పీఠం కొద్దిపాటి వస్తువులు సేకరించింది. కాని అవి వర్షాలకు కొట్టుకుపోయాయని చెప్పారు. ఇప్పుడు రెడీమేడ్‌గా సేకరించి ఉన్న భాండాగారానికి తలుపులు మూయడం సరికాదని మేధావులు, పరిశోధకులు భావిస్తున్నారు. ఆదివాసీ, జానపదుల సృజనాత్మక కళాఖండాలను వ్యతిరేకించడం అప్రజాస్వామికం. ఇది ఆ ప్రజలను వ్యతిరేకించడమే అవుతుంది. మనువాద ఆలోచనాధోరణి సరికాదని సబ్బండ వర్ణాల గౌరవచిహ్నాలే కాదు, ఆయా సమాజాల--సమూహాల ఆత్మగౌరవానికి సంబంధించిన వస్తుజాలాన్ని నిరాకరించవద్దని ప్రజలు కోరుతున్నారు.

భారతదేశ చరిత్రలో మొదటిసారి ఇన్ని రకాల అపురూప కళాఖండాలను ఒకచోట మ్యూజియంగా ఏర్పాటు కావడాన్ని స్వాగతించాలి. ఆద్యకళ 'ఆదిధ్వని' ఫౌండేషన్, హైదరాబాద్ వారు సేకరించిన ఆదివాసుల 170 కళాఖండాలు ప్రస్తుతం భారత రాష్ట్రపతి చొరవతో ఏర్పాటు చేసిన 'జనజాతి దర్పణ్' పేర న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, మార్బుల్ హాలులో ప్రదర్శనకు ఉన్నాయి. పారిస్, లండన్, ఢిల్లీ వంటి పలుచోట్ల ఆద్యకళ మ్యూజియం వస్తువులు ప్రదర్శితమయ్యాయి. ఇంతటి కీర్తి కలిగిన ప్రదర్శనశాల ఏర్పాటును వ్యతిరేకించే విశ్వవిద్యాలయం అధికారులు మరోసారి ఆలోచించాలి. తాను జారీ చేసిన జీవోను అమలయ్యేలా ప్రభుత్వం చూడాలి. ప్రతిరోజు వందలాది మంది సందర్శకులతో మ్యూజియం కళకళలాడాలి. విద్యార్థులు, పరిశోధకులకు ప్రాథమిక పరిశోధన వనరుగా ఉండాలి.

# సంతాప సందేశం ఇటీవల స్వర్గస్థులైన తెలుగుదేశం పార్టీ మాజీ నాయకులు

( జూన్ - 29- హంస కలంవార్త )

సినీ నిర్మాత, సామాజికవేత్త గొట్టిముక్కల పద్మారావు చిత్రపటానికి నమస్కరించి ఘన నివాళులు అర్పించడమైనది. వారి కుటుంబసభ్యులను కలిసి ప్రఘాడ సానుభూతి ప్రకటించడం జరిగింది. స్వతహాగా తెలుగుదేశం పార్టీ అభిమానులమైన మా కుటుంబానికి హైదరాబాద్ / కూకట్ పల్లి లో (1995-96) పరిచయమైన మొట్ట మొదటి తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిముక్కల పద్మారావు . పార్టీ అభిమానంతో పాటుగా బాగ్ అమిర్ లో వారి మాతృమూర్తి పేరుమీద రాజ్యలక్ష్మి నివాస్ అనే అపార్ట్మెంట్ ని వారు నిర్మించడం, అందులో మా మామయ్య ఫ్లాట్ కొనుక్కోవడం ద్వారా వారి కుటుంబసభ్యులతో




తరుచుగా కలవడం జరుగుతుండేది. ఎంతో మృదుస్వభావి అయిన పద్మారావు అంటే నాకు ఒక ప్రత్యేకమైన అభిమానం, ఏర్పడింది. వారి రాజకీయ ప్రయాణం ఎలా జరిగినా మేము కలిసినప్పుడు అదే అభిమానంతో మాట్లాడుకోవడం జరిగేది. నేను రాజకీయంగా తెలుగుదేశం పార్టీ లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నా వారి మాటతీరులో ఎప్పుడూ తేడా కనిపించేది కాదు. "2018 లో జరిగిన శాసనసభ ఎన్నికలలో మహాకూటమి" తరుపున ప్రచారంలో ముఖ్య నాయకులుగా కీలక భూమిక పోషించడం మరువలేనిది. గొట్టిముక్కల పద్మారావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్ధిస్తూ.. మరొక్కమారు నివాళులు అర్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో.. వెంకట్, పోసాని శ్రీనివాసరావు, ఆలూరి ధర్మారావు పలువురు మిత్రులు పాల్గొన్నారు. మీ వేజండ్ల కిషోర్ బాబు Ex. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు. తెలుగుదేశం పార్టీ, తెలంగాణ. (కూకట్ పల్లి నియోజకవర్గం)

## గొట్టిముక్కల పద్మారావు కుటుంబాని పరామర్శించిన పట్నం మహేందర్ రెడ్డి ఎమ్మెల్సీ తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్

( జూన్ - 29- హంస కలంవార్త )

కూకట్ పల్లిలో పద్మారావు చిత్రపటానికి పూలు వేసి నమస్కరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుకట్ పల్లి నియోజకవర్గం అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, తమ్మినేని ప్రవీణ్ కుమార్, కూకట్ పల్లి నియోజకవర్గం క్రిస్టియన్ మైనార్టీ కోఆర్డినేటర్ మేకల మైఖేల్, ఏఎంసి డైరెక్టర్



ఫణింద్ర కుమార్, మైనారిటీ సెల్ సీనియర్ నాయకుడు మగ్దుం భాయ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కోలికోట శంకర్, యూత్ నాయకులు హర్షవర్ధన్ , కళ్యాణ్ బాబు, దుర్గాప్రసాద్, భార్గవ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లి బాబు, కొమ్ము బాబురావు, సూరిబాబు, మహిళా నాయకురాలు దార్ల వనజ, స్వప్న రెడ్డి, కోమలి, దీప్తి, తదితరులు పాల్గొని నివాళు లర్పించారు..

# వర్షాకాల ట్రాఫిక్ సమస్యల నివారణకు సమగ్ర కార్యాచరణ

-కీలక ఆదేశాలు జారీ చేసిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్.

( జూన్ 29 హంసకలం వార్త )

వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు, వాటర్ లాగింగ్ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., అధ్యక్షతన జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్హెచ్వోలు పాల్గొన్నారు. సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని వాటర్ లాగింగ్ ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్కు చెందిన సుమారు 150 మంది సిబ్బందిని ట్రాఫిక్ విధుల్లో పోలీస్ స్టేషన్ల వారీగా ఎలా వినియోగిస్తున్నారనే అంశంపై సమీక్ష నిర్వహించి, అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్, ఆక్టోపస్కు చెందిన సుమారు 150 మంది సిబ్బంది పనితీరును కూడా కమిషనర్ సమీక్షించారు. వారికి కేటాయించిన విధులు, ట్రాఫిక్ నియంత్రణలో వారి పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలు, వర్షాకాలంలో స్పందన తీరు వంటి అంశాలపై అధికారులతో చర్చించి, మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా అవసరమైన సూచనలు చేశారు. జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్లు, యూ-టర్న్లను అడ్డుకునే వాహనాలపై, రాంగ్ రూట్లో ప్రయాణించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వాటర్ లాగింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం సమస్యలు తలెత్తే ప్రాంతాలపై సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, రోడ్డు కటింగ్ పనులు చేపట్టే ముందు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విప్రో జంక్షన్, డీఎల్ఎఫ్ జంక్షన్, షాపూర్ నగర్, కూకట్పల్లి వై-జంక్షన్, మియాపూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ జాకెట్లు, రెయిన్ కోట్లు ధరించాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని ప్రయాణాన్ని అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.

# మందమర్రిలో బీఎల్ఏ-2 సమీక్ష సమావేశంలో మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

( జూన్ - 29- హంస కలంవార్త )

మందమర్రి పట్టణంలోని బి-1 కార్యాలయంలో నిర్వహించిన బీఎల్ఏ-2 సమీక్ష సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏ-2 ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ వెంకటస్వామి బూత్ స్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడం, బీఎల్ఏ-2 వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడం, ఓటరు జాబితాపై నిరంతర



పర్యవేక్షణ చేపట్టడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి బూత్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలంతా సమన్వయంతో



పనిచేయాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# "యూనియన్ ఎన్నికలకు టీజీఎస్ ఆర్టీసీ కసరత్తు షురూ..

-రెండు, మూడు రోజుల్లో వెలువడనున్న తొలి నోటీసు..!"

( జూన్ - 29- హంస కలంవార్త )

టీజీఎస్ ఆర్టీసీ (TGSRTC) లో యూనియన్ ఎన్నికల నిర్వహణపై ఉద్యోగుల్లో నెలకొన్న ఉత్కంఠకు, అనుమానాలకు తెరదించుతూ యాజమాన్యం ఎన్నికల ప్రక్రియకు సర్వం సిద్ధం చేస్తోంది. యూనియన్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఆర్టీసీ యాజమాన్యం అడుగులు వేగవంతం చేసింది...

**ఎన్నికల ప్రక్రియలో కీలక అంశాలు :**

ఎన్నికల నిర్వహణ అధికారిగా ప్రభుత్వం నియమించిన జాయింట్ లేబర్ కమీషనర్ గారు ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యంతో భేటీ అయ్యారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీ నేపథ్యంలో యూనియన్ వేరిఫికేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది.

ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన పోలింగ్ బూత్ల వివరాలు, బూత్ ఇన్ఛార్జ్ల జాబితాను ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ఎన్నికల నిర్వహణ అధికారికి (జాయింట్ లేబర్ కమీషనర్కు) అందజేసింది.

**రెండు, మూడు రోజుల్లో తొలి నోటీసు:**

ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మరో రెండు, మూడు రోజుల్లో 'ఫస్ట్ నోటీస్' ఇచ్చేందుకు ఎన్నికల నిర్వహణ అధికారి ( జాయింట్ లేబర్ కమీషనర్) ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ అంతా ఎక్కడా ఎలాంటి ఆటంకాలు లేకుండా, పారదర్శకంగా ముగిసేలా ఆర్టీసీ యాజమాన్యం నిరంతరం ఎన్నికల అధికారితో చర్చిస్తూ, సమన్వయం చేసుకుంటోంది.

## సోమవారం కేపిహెచ్బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కార్యాలయంలో




( జూన్ - 29- హంస కలంవార్త )

అసోసియేషన్ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు తో ఎస్.ఐ.ఆర్ పై సమావేశం నిర్వహించారు.. ఇందులో ప్రధానంగా అధికారులు మన ఇంటికి వచ్చినప్పుడు వారికి సరైన రీతిలో సమాధానం చెప్పి మన ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని ..అలాగే ఏమైనా సందేహాలు ఉంటే ప్రజలకు నివృత్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని.. దీనికి తగిన విధంగా అధికారులు వచ్చినప్పుడు పూర్తిస్థాయిలో వారి వద్ద నుంచి వివరాలు అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు... అలాగే మనం అందుబాటులో లేనప్పుడు మన ఓటును తొలగించే పరిస్థితి కూడా ఏర్పడుతుందని అందుకనే అప్రమత్తంగా ఉండి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు.. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, పాతూరి గోపి, రాజేష్, సాయి శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, హనుమంత రావు, సాంబశివ రావు, గఫూర్, GLN రెడ్డి, హనుమంత రావు, గంగూరి శ్రీనివాస రావు, భారతి, లత, హేమ, సుబ్బలక్ష్మీ, పద్మ, లీల, బిఆర్ఎస్ నాయకులు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు...

## శంషిగూడ డివిజన్ పరిధిలోని ఇందిరా హిల్స్ కాలనీ లో



( జూన్ - 29- హంస కలంవార్త )

నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయము శంకుస్థాపన కార్యక్రమానికి డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ ప్రజలందరూ కలిసి మెలసి భక్తి శ్రద్ధలతో ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జోగిపేట్ భాస్కర్, ఇందిరా హిల్స్ కాలనీ అధ్యక్షులు వెంకట్ నాయక్, కాలనీ వాసులు, వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ వర్క్ డిప్యూటీ జనరల్ మ్యానేజర్ భరత్ నగర్ కాలనీ లో

( జూన్ - 29- హంస కలంవార్త )

ఆదివారం నాడు ఉదయం నేను మరియు మా కమిటీ సభ్యులు పాదయాత్ర చేస్తున్న సమయము లో కొన్ని సమస్యలు మా దృష్టికి స్థానిక కాలని వాసులు ప్రజలు మంచి నీటిలో కలుషిత నీరు వస్తుంది అని అలాగే చాలా మట్టుకు నీరు రోడ్డు పై హృదాగ పోతుందని తెలియ చేయడం జరిగింది. అలాగే అనేక ప్రాంతాల్లో డ్రైనేజ్ మ్యాన్ హోల్స్ రిపేర్ కు ఉన్నవి. కలుషిత నీరు



ఉన్నచోట తక్షణమే మరమత్తులు చేసి కాలనిలో ప్రజల ప్రాణాలకు ముప్పు రాకుండా చూడాలని మనవి ఇట్లు మి డాక్టర్ పి నాగిరెడ్డి అద్యక్షులు భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం మరియు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

హంస కలం వార్త HAMSA KALAM VARTA మంగళవారం 30 జూన్ 2026

# విద్యార్థిగా మారి.. పాఠాలు విని

**-విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**



జూన్ 29 హంసకలం వార్త

నిత్యం విధి నిర్వహణలో బిజీ బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ విద్యార్థులకు బోధన చేస్తున్న తీరును వారితో కలిసి కూర్చుని పరిశీలిస్తూ పాఠ్యాంశం విన్నారు.ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో సోమవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎకనామిక్స్ పాఠ్యాంశం ఉపాధ్యాయుడు బోధిస్తుండగా,జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి బెంచి పై కూర్చున్నారు.పాఠ్యాంశం బోధనను స్వయంగా పరిశీలించారు.పూర్తి అయిన తర్వాత దానిపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.అనంతరం డైనింగ్ హాల్ కు వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా ముందుగా మెనూ పరిశీలించి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు.విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవాలని,ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువులో రాణించి తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు.లైబ్రరీ లో పుస్తకాలతోపాటు దిన పత్రికలు చదవాలని తెలిపారు.దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ వివరించారు.పరిశీలనలో ప్రిన్సిపాల్ ఫాతిమా,ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# జూలై 1న గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యుల ఎంపికకు వాక్-ఇన్- ఇంటర్వ్యూ

**-డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్**
**-పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కొరకు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైట్ ను సందర్శించాలి..**

జూన్ 29 హంసకలం వార్త

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని మధిర ఏరియా ఆసుపత్రి, కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లలో ప్రజలకు గైనకాలజీ వైద్య సేవలు నిరంతరాయంగా అందించేందుకు అత్యవసర ప్రాతిపదికన జూలై 1న ఉదయం 11 గంటలకు వాక్-ఇన్- ఇంటర్వ్యూ ద్వారా గైనకాలజీ స్పెషలిస్ట్ వైద్యులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ కె. రాజశేఖర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధిర ఏరియా ఆసుపత్రికి ఒకరు, కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఒకరు చొప్పున మొత్తం ఇద్దరు గైనకాలజీ (OBG) స్పెషలిస్టులను ఎంపిక చేయనున్నట్లు అన్నారు. ఎంపికైన ప్రతి వైద్యునికి నెలకు లక్ష రూపాయల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్ (OB & GY) ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత విభాగంలో అదనపు అర్హతలు, సాధారణ పని అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ఇతర ప్రభుత్వ వైద్య సంస్థల్లో గైనకాలజీ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలు రెగ్యులర్, కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కాదని, ప్రజల అత్యవసర వైద్య అవసరాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కేవలం రెండు నెలల కాలానికి మాత్రమే తాత్కాలిక సేవల కోసం చేపడుతున్న చర్య అని స్పష్టం చేశారు. వాక్-ఇన్-ఇంటర్వ్యూ జూలై 1, 2026 తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఖమ్మంలోని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ ఖీ-2లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహిం చనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గత ప్రభుత్వ సేవల అనుభవ ధ్రువపత్రాలు, రెండు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో నిర్ణీత తేదీ, సమయానికి నేరుగా వాక్-ఇన్- ఇంటర్వ్యూ కు హాజరుకావాలని సూచించారు.పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనా కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్సైటు https://khammam. telangana.gov.in ను సందర్శించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జూలై 24 లోగా ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పూర్తి చేయాలి: ఓటర్ల జాబితా

# అనుసంధానంపై కలెక్టర్ రాజర్షి షా కీలక ఆదేశాలు





జూన్ 29 హంసకలం వార్త

పౌరులందరూ బాధ్యతగా జూలై 24 లోగా తమ వివరాలను నమోదు చేసుకుని ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని హామలీవాడ, భాగ్యనగర్ కాలనీల్లో ఎస్.ఐ.ఆర్. పక్రియను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో పర్యటిస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఎన్యూమరేషన్ ఫారం ను ఓటర్లకు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై జూలై 24 వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కాలవ్యవధిలో ఓటర్ల వివరాల సేకరణ, సవరణలు, అనుసంధాన ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో పోలింగ్ చిట్టీలు అందజేసే బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శిస్తారనీ, వారు ప్రతి కుటుంబానికి రెండు జతల ఎన్యూమరేషన్ ఫారాలను అందిస్తారని తెలిపారు.ప్రజలు ఈ ఫారాలను సక్రమంగా పూరించి,తమ ప్రస్తుత ఓటు వివరాలను 2002 ఓటర్ల జాబితాతో తమ పేరు లేదా తమ కుటుంబ సభ్యులైన తల్లి, తండ్రి, తాత, నానమ్మ/అమ్మమ్మ తదితరుల వివరాలు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని, లింక్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఆ వివరాలను ప్రస్తుతం పూరిస్తున్న ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపరచాల్సి ఉంటుందనీ, ఆ తర్వాత పూర్తిగా నింపిన ఫారంపై సంతకం చేసి, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరిచి సంబంధిత బీఎల్ఓకి అందజేయాలన్నారు. ఇందులో ఒక కాపీని బీఎల్ఓ తీసుకుంటారని, మరో కాపీని ఓటరు తమ వద్ద భద్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటు వివరాలను తెలుసుకోవడానికి బీఎల్ఓలను సంప్రదించవచ్చని, లేదా సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారు సొంతంగా voters.eci.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, 'Search by Electoral' ఆప్షన్ ద్వారా తమ సమాచారాన్ని ఉచితంగా తెలుసుకోవచ్చని సూచించారు. 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత ఓటును లింక్ చేయడం వల్ల ఓటు కట్ అవుతుందనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అటువంటి అపోహలను ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన ప్రతి ఒక్కరి ఓటు ఖచ్చితంగా భద్రంగా ఉంటుందని,ఈ ఫారాలు ఇవ్వని వారి ఓట్లు మాత్రమే భవిష్యత్తులో తొలగించబడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ ఎన్నికల ఓటర్ల సవరణ ప్రక్రియలో పాల్గొనడం ప్రతి పౌరుని యొక్క ప్రాథమిక బాధ్యత అని కలెక్టర్ గుర్తుచేశారు. కాబట్టి జిల్లాలోని పౌరులందరూ బాధ్యతగా వ్యవహరించి, జూలై 24 లోగా తమ వివరాలను నమోదు చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష,పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ పద్మావార్ రాకేష్,గంట జీవన్, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు, కాలనీ వాసులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి





**-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**
**-ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు..**

జూన్ 29 హంసకలం వార్త

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. శ్రీను తనకు గతంలో దివ్యాంగుల పెన్షన్ వచ్చేదని, సదరం సర్టిఫికెట్ చేసినప్పటికీ ఆగిపోయిందని తనకు పెన్షన్ మళ్ళీ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే. నాజియా తన కూతురికి తలసేమియా వ్యాధి ఉందని సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ మంజూరు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం హిమాంనగర్ గ్రామ పంచాయతీ ప్రజలు, విద్యార్థుల తల్లి దండ్రులు గ్రామపంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాల ఆక్రమణలను తొలగించి విద్యార్థుల సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కూసుమంచి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన చాగంటి శ్రీదేవి తనకు సర్వే నెంబర్ 591/1/2 లో రెండు ఎకరాల భూమి ఉందని, దానిని అక్రమంగా సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకోవడం జరుగుతుందని, ధరణిలో సర్వే నెంబర్ మిస్ మ్యాచ్ అయిందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కూసుమంచికి రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన





**-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్**

జూన్ 29 హంసకలం వార్త

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ సమీపంలోని నవభారత్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయ భవనాన్ని, ఎస్పీ క్యాంప్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో మాట్లాడిన ఎస్పీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయ గదులు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్బి 2 ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాస్, ఆర్ & బీ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# నాణ్యతలో రాజీ లేకుండా గడువులోగా పనులు పూర్తి చేయాలి





-ప్రభుత్వం ఆమోదించిన నమూనా ప్రకారమే నిర్మాణాలు
-నాగర్ కర్నూల్ కలెక్టర్ అధికారులకు ఆదేశం

జూన్ 29 హంసకలం వార్త

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జట్రపోల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్ఠాత్మక తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఉదయం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థ పనుల పురోగతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల అమలులో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జాప్యానికి తావులేకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించిన లక్ష్యాల ప్రకారం పనులను ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల భవనంలోని తరగతి గదులు, పరిపాలనా విభాగం, బాలురు, బాలికల వసతి గృహాలు, డైనింగ్ హాల్, వంటశాల, ప్రయోగశాలలు, గ్రంథాలయం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, అంతర్గత రహదారులు, ప్రహరీ గోడ తదితర నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం ఆమోదించిన మ్యాప్‌కు అనుగుణంగా నిర్మాణాలు కొనసాగుతు న్నాయా లేదా అనే అంశాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి అవసరమైన సాంకేతిక సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంపొందించేందుకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యాధునిక విద్యా, వసతి, క్రీడా సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందించాలనే లక్ష్యంతో ఈ విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు, నిర్మాణ పనులు ప్రభుత్వం ఆమోదించిన నమూనా ప్రకారం, ఇంజినీరింగ్ ప్రమాణాలను పూర్తిగా పాటిస్తూ చేపట్టాలని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని, నిర్మాణంలో ఉపయోగించే ప్రతి నిర్మాణ సామగ్రి నాణ్యమైనదిగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తిగా ఈ పాఠశాల భవనం నిలవాలంటే ప్రతి పనిని అత్యంత బాధ్యతతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ పనుల పురోగతిని వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జటప్రోలు సర్ ప్రక్రియను పరిశీలించారు. పెంట్లవెల్లి కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, సంబంధిత శాఖల అధికారులు, ఇడబ్ల్యుఐడీసీ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల వివరాలు బి.ఎల్.ఓ.యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలి





-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జూన్ 29 హంసకలం వార్త

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాలు అందించి ఓటర్ల నుండి సేకరించిన సమాచారం బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 21,15 వార్డులలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను మండల తహసిల్దార్ సతీష్ కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని, ఓటర్ల నుండి సేకరించిన వివరాలను బి.ఎల్.ఓ.యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు నిర్వహించే సమగ్ర సవరణ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఈ క్రమంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లిన సమయంలో ఎన్యుమరేషన్ ఫారం అందించినప్పుడు బి ఎల్ ఓ యాప్ లో మార్క్ చేయాలని తెలిపారు. సదరు ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపిన తరువాత తిరిగి సేకరించి యాప్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారు, 2 అంతకు మించి ఎపిక్ కార్డులు కలిగి ఉండడం అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకరికి ఒక ఓటరు గుర్తింపు కార్డు మాత్రమే ఉండేలా స్పష్టమైన జాబితా రూపొందించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపిన తరువాత తిరిగి సేకరించి బి ఎల్ ఓ యాప్ లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
-ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి



జూన్ 29 హంసకలం వార్త

పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి ప్రతి విడతలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, ప్రతి విడతలో మళ్లీ చుక్కలు వేయించడం ద్వారా పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలో ఒక్క చిన్నారి పోలియో చుక్కలు మిస్ కాకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పోలియో రహిత నిర్మల్ జిల్లా లక్ష్యంగా ప్రతి ఇంటికి అవగాహన కల్పించి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని, ప్రజలు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్



జూన్ 29 హంసకలం వార్త

ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
-ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 98



జూన్ 29 హంసకలం వార్త

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 98 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



జూన్ 29 హంసకలం వార్త

ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు(రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## నిఫ్టీ 24,000 దిగువకు.. మార్కెట్లపై పశ్చిమాసియా ప్రభావం



నిఫ్టీకి 23,900 వద్ద మద్దతు, 24,000 వద్ద నిరోధం ఉందని నిపుణుల విశ్లేషణ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీనికి తోడు ఆటో, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 372.10 పాయింట్లు నష్టపోయి 76,728.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109.75 పాయింట్లు క్షీణించి 23,946.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలతో ట్రేడర్లు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడారు. దీంతో దాదాపు అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. సాంకేతిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,000 కీలక నిరోధంగా మారింది. దీనిని దాటితే 24,100-24,200 స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక దిగువన 23,900 తక్షణ మద్దతుగా, 23,800 బలమైన మద్దతుగా పనిచేస్తుందని వారు తెలిపారు. ఈరోజు ట్రేడింగ్‌లో ఫార్మా, మెటల్, హెల్త్‌కేర్ రంగాలు రాణించగా.. ఆటో, కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు అత్యధికంగా నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ మిడ్‌క్యాప్ సూచీ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం మేర నష్టపోయాయి. రాబోయే రోజుల్లో పశ్చిమాసియా పరిణామాలు, ఇతర అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం.. టోల్ చెల్లించకుండా 12 నౌకలు ఇండియాకు

- హర్మూజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- ఆ సమయంలో కేంద్ర తీసుకున్న చర్యలను వివరించిన హర్దీప్ సింగ్ పురీ
- పలు దేశాల నుంచి ముడి చమురు తెప్పించామని వెల్లడి
- దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా పెంచామన్న మంత్రి
- ఈ చర్యల వల్లే వినియోగదారులపై ప్రభావం పడలేదని వ్యాఖ్య




ప్రపంచాన్ని కుదిపేసిన ఇంధన సంక్షోభ సమయంలో పరిస్థితిని భారత్ సమర్థంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. హర్మూజ్ జలసంధిని దాదాపు నాలుగు నెలలు మూసివేసినా దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టోల్ చెల్లించకుండానే 12కు పైగా ఎల్‌పీజీ నౌకలను హర్మూజ్ నుంచి తరలించామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని పురీ పేర్కొన్నారు. ముడిచమురు దిగుమతులను ఒక్క దేశానికే పరిమితం చేయకుండా పలు దేశాల నుంచి తెప్పించామని చెప్పారు. దీంతో దేశంలో వంటగ్యాస్, ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు. సంక్షోభ సమయంలో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా భారీగా పెంచామని వివరించారు. ఇంతకుముందు వంటగ్యాస్ ఉత్పత్తి చేయని రిఫైనరీలను కొద్ది రోజుల్లోనే మార్పులు చేసి ఎల్‌పీజీ తయారీకి సిద్ధం చేశామని చెప్పారు. దీంతో రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తిని 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచగలిగామని తెలిపారు. వంటగ్యాస్ కొరత రాకుండా అల్జీరియా, జపాన్, కెనడా వంటి దేశాలతో కొత్త సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నామని పురీ చెప్పారు. అమెరికా నుంచి అదనపు ఎల్‌పీజీ కార్గోలను కూడా తెప్పించామని వెల్లడించారు. దీంతో దేశీయ అవసరాలను పూర్తిగా తీర్చగలిగామని అన్నారు. ఇంధన ధరల భారం తగ్గించేందుకు కేంద్రం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని గుర్తుచేశారు. అలాగే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు వంటగ్యాస్ పంపిణీలో డిజిటల్ అథెంటికేషన్ విధానాన్ని తప్పనిసరి చేశామని చెప్పారు. ఈ చర్యల వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభ ప్రభావం భారత వినియోగదారులపై పడకుండా కాపాడగలిగామని హర్దీప్ పేర్కొన్నారు.

## రూ. 4 లక్షల కోట్ల ఫేక్ మార్కెట్.. రహస్య ఏజెంట్లను ప్రయోగిస్తున్న బ్రాండ్లు!



అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్లు భారత్‌లో భారీగా విస్తరించిన నకిలీ వస్తువుల మార్కెట్‌పై ఉక్కుపాదం మోపుతున్నాయి. వెర్సాచీ, మైఖేల్ కోర్స్, జిమ్మీ చూ వంటి ప్రఖ్యాత కంపెనీలు నకిలీ సరుకును అరికట్టేందుకు రహస్య ఇన్వెస్టిగేటర్లను నియమించుకుంటున్నాయి. వీరు సాధారణ కస్టమర్ల రూపంలో మార్కెట్లలోకి వెళ్లి, నకిలీ వస్తువులను విక్రయించే వారి సమాచారాన్ని సేకరించి కంపెనీలకు అందిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా సదరు బ్రాండ్లు పోలీసుల సాయంతో దాడులు నిర్వహించి, నకిలీ సరుకును స్వాధీనం చేసుకుని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాయి. గతనెలలో వెర్సాచీ కంపెనీకి ఓ ఇన్వెస్టిగేటర్ ఇచ్చిన సమాచారంతో తూర్పు ఢిల్లీలోని ఓ బల్క్ సెల్లర్‌పై పోలీసులు దాడి చేశారు. నగరంలోని పలు దుకాణాలకు నెలనెలా లక్షల రూపాయల విలువైన నకిలీ సరుకును సరఫరా చేస్తున్న అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, స్టాక్‌ను సీజ్ చేశారు. భారత్‌లో అసలైన లగ్జరీ మార్కెట్ విలువ 6 నుంచి 8 బిలియన్ డాలర్లు కాగా, 2028 నాటికి ఇది 12 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అయితే, దీనికి భిన్నంగా నకిలీ దుస్తులు, యాక్సెసరీల మార్కెట్ విలువ సుమారు రూ. 4 లక్షల కోట్లు ఉంటుందని 2024 ఫిక్కీ నివేదిక పేర్కొంది. రోడ్ల పక్కన అమ్మకాల నుంచి ఆన్‌లైన్ వేదికల ద్వారా వ్యవస్థీకృత నెట్‌వర్క్‌గా ఈ దందా విస్తరించింది.

## ఒలింపిక్స్2028... టీమిండియా అభిమానులకు శుభవార్త!

స్పోర్ట్స్ డెస్క్:

ఆదివారం టీమిండియా అభిమానులకు బ్లాక్ డే. పురుషుల, మహిళల క్రికెట్ జట్లు రెండూ ఓడిపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. 2028లో లాస్ ఏంజెలెస్ జరిగే ఒలింపిక్స్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు పాల్గొననుంది. అలానే పురుషుల జట్టు కూడా మార్గం సుగమం కానుంది. ఈ సారి జరిగే విశ్వక్రీడల్లో క్రికెట్‌ను చేరుస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. శతాబ్దం కాలం తర్వాత ఒలింపిక్ క్రీడల్లోకి క్రికెట్ అడుగుపెడుతున్న వేళ.. ఐసీసీ అత్యంత కీలకమైన అర్హత ప్రమాణాలను ప్రకటించింది. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్ వేదికగా జరగబోయే ఈ క్రీడల్లో పురుషులు, మహిళల విభాగాల్లో చెరో 6 జట్లు మాత్రమే తలపడనున్నాయి. ఐసీసీ విడుదల చేసిన ఈ నిబంధనల ప్రకారం.. భారత మహిళల జట్టు ఇప్పటికే ఒలింపిక్స్ అర్హత సాధించగా, పురుషుల జట్టుకు మాత్రం 2026 డిసెంబర్ నాటి ర్యాంకింగ్స్ కీలకం కానున్నాయి. ప్రస్తుతం పురుషుల క్రికెట్‌లో ఇండియా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా అత్యుత్తమంగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. కాబట్టి పురుషుల జట్టు అర్హత కూడా దాదాపు లాంఛనమే. మహిళల విభాగంలో ప్రస్తుతం ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్ ఆధారంగా తొలి నాలుగు స్థానాలను ఖరారు చేశారు. నాలుగు వేర్వేరు ఖండాల నుంచి అత్యుత్తమ ప్రదర్శన చేసిన భారత్ (ఆసియా), ఆస్ట్రేలియా (ఆస్ట్రేలియా), దక్షిణాఫ్రికా (ఆఫ్రికా), ఇంగ్లండ్ (యూరప్) జట్లు సెమీఫైనల్స్ చేరడం ద్వారా నేరుగా ఒలింపిక్స్ బెర్త్‌లను సొంతం




చేసుకున్నాయి. అలానే ఆతిథ్య దేశ హోదాలో అమెరికా పురుషుల, మహిళల జట్లు టాప్-15 ర్యాంకింగ్స్‌లో ఉంటే నేరుగా అర్హత సాధిస్తాయి. మిగిలిన ఒకే ఒక్క స్థానం కోసం 2027లో ప్రత్యేకంగా 'ఐసీసీ ఒలింపిక్స్ క్వాలిఫైయర్' టోర్నమెంట్ నిర్వహిస్తారు. కాగా, వెస్టిండీస్ జట్టు ఐసీసీ గుర్తింపు పొందినప్పటికీ.. దానికి ప్రత్యేక ఒలింపిక్ కమిటీ లేనందున, కరేబియన్ దీవుల దేశాలు విడివిడిగా ఈ క్వాలిఫైయర్‌లో తలపడాల్సి ఉంటుంది. ఒలింపిక్స్‌లో ప్రతి జట్టులో 15 మంది ఆటగాళ్లకు మాత్రమే అవకాశం ఉంటుందని సమాచారం.

## భారత్‌పై చరిత్రాత్మక విజయం.. ఐర్లాండ్ కోచ్ సంచలన నిర్ణయం

స్పోర్ట్స్ డెస్క్:

ప్రపంచ ఛాంపియన్ భారత జట్టుపై టీ20 సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసి చారిత్రాత్మక విజయంతో ఊపుమీదున్న ఐర్లాండ్ క్రికెట్‌లో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. భారత్‌తో జరిగిన రెండో టీ20లో ఒక పరుగు తేడాతో ఉత్కంఠ విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకున్న 24 గంటల వ్యవధిలోనే.. ఆ జట్టు ప్రధాన కోచ్ హెన్రిచ్ మలాన్ తన పదవికి రాజీనామా చేశారు. నాలుగున్నరేళ్ల పాటు జట్టుకు అద్భుతమైన సేవలు అందించిన ఈ దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్.. ఇకపై కొత్త కోచ్ బాధ్యతలు చేపడితే బాగుంటుందని భావించి ఆటగాళ్లకు, సిబ్బందికి తన నిర్ణయాన్ని వెల్లడించారు. నిజానికి ఆయన ఒప్పందం 2027 వరకు ఉన్నప్పటికీ, ముందే తప్పుకోవడం గమనార్హం. మలాన్ పర్యవేక్షణలో ఐర్లాండ్ క్రికెట్ స్వర్ణయుగాన్ని చూసింది. వరుసగా మూడు టీ20 ప్రపంచకప్‌లకు అర్హత సాధించడంతో పాటు టెస్ట్ హోదా వచ్చాక అఫ్గానిస్థాన్, జింబాబ్వేలపై చరిత్రాత్మక టెస్ట్ విజయాలను నమోదు చేసింది.




# స్పోర్ట్స్

## హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీపై సెలెక్టర్లదే తుది నిర్ణయం: టీమిండియా హెడ్ కోచ్


స్పోర్ట్స్ డెస్క్:



ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా ప్రయాణం మరోసారి గ్రూప్ దశలోనే ముగిసింది. లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియాతో జరిగిన కీలక పోరులో భారత్ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. భారత్ నిర్దేశించిన 170 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆసీస్ బ్యాటర్లు ఎల్లీస్ పెర్రీ, యాష్లే గార్డనర్ అద్భుత శతక భాగ స్వామ్యంతో ఛేదించి రికార్డు సృష్టించారు. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీపై విమర్శలు వస్తున్నప్పటికీ టీమిండియా ప్రధాన కోచ్ అమోల్ ముజుందార్, మాజీ క్రీడాకారిణి అంజుమ్ చోప్రా ఆమెకు పూర్తి మద్దతుగా నిలిచారు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కోచ్ ముజుందార్ మాట్లాడుతూ.. హర్మన్‌ప్రీత్ భారత జట్టు సారథిగా కొనసాగాలనేదే తన అభిమతమని స్పష్టం చేశాడు. అయితే, నాయకత్వ మార్పుపై తుది నిర్ణయం సెలెక్టర్లదేనని పేర్కొన్నాడు. హర్మన్‌ప్రీత్ కెప్టెన్‌గా కొనసాగుతుందని మీరు భావిస్తున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. అవును, అయితే కెప్టెన్‌ను నిర్ణయించాల్సింది సెలెక్టర్లేనని ముజుందార్ బదులిచ్చాడు. మరోవైపు మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా కూడా హర్మన్‌కే ఓటేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత జట్టును నడిపించడానికి ఆమె కంటే మెరుగైన ప్రత్యామ్నాయం లేదని అభిప్రాయపడ్డింది. డబ్ల్యూపీఎల్ (WPL)లో చూపించే దూకుడును అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మన టాప్ ఆర్డర్ ప్రదర్శించలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేసింది. భయపడకుండా ఆడే భిన్నమైన విధానాన్ని అలవర్చుకోవాలని, కనీసం 180 పరుగులను లక్ష్యంగా పెట్టుకుని ఆడగలిగే బ్యాటర్లను గుర్తించడం పై ఇకనైనా దృష్టి పెట్టాలని అంజుమ్ చోప్రా సూచించింది.

# ఎన్టీఆర్-త్రివిక్రమ్ భారీ ప్రాజెక్ట్ దైవిక నేపథ్యంతో దృశ్య కావ్యం!

-ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో మరో భారీ చిత్రం
-దైవిక నేపథ్యంతో రానున్న సినిమా అని వెల్లడి
-అనిరుధ్ రవిచందర్ సంగీత సారథ్యం
-హారిక అండ్ హాసిని, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్త నిర్మాణం
-అరవింద సమేత తర్వాత మళ్లీ చేతులు కలిపిన బ్లాక్‌బస్టర్ ద్వయం



యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో మరో భారీ చిత్రానికి రంగం సిద్ధమైంది. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ, ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఎన్టీఆర్ ఆసక్తికర పోస్టర్ ను పంచుకున్నారు. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న కలయికల్లో ఇది ఒకటి కావడంతో ఈ ప్రకటనతో సినీ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘అరవింద సమేత వీర రాఘవ’ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు కూడా పొందింది. ఆ సినిమా తర్వాత మళ్లీ ఈ విజయవంతమైన ద్వయం చేతులు కలపడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈసారి సరికొత్త కథాంశంతో, మునుపెన్నడూ చూడని రీతిలో ఈ చిత్రం ఉండబోతోందని తెలుస్తోంది. దైవిక నేపథ్యంతో ఈ సినిమా రూపుదిద్దుకోనుందని చిత్ర వర్గాలు వెల్లడించాయి. కుమారస్వామి ఇతివృత్తంతో... పురాణాల స్ఫూర్తితో కూడిన కథ, లోతైన భావోద్వేగాలు, ఉత్కంఠభరితమైన యుద్ధ సన్నివేశాలు, సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేలా ఈ దృశ్యకావ్యం ఉండబోతోందని సమాచారం. ఎన్టీఆర్ నటన, త్రివిక్రమ్ సంభాషణలు ఈ దైవిక కథకు మరింత బలాన్ని చేకూర్చనున్నాయని అభిమానులు భావిస్తున్నారు. ఈ భారీ చిత్రానికి సాంకేతిక బృందం కూడా అదే స్థాయిలో ఉండనుంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించనున్నారు. తన నేపథ్య సంగీతంతో సినిమాకు ప్రాణం పోసే అనిరుధ్, ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. నిర్మాణ విలువల విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా, ఈ భారీ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు), నందమూరి కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత విజయవంతమైన కలయికల్లో ఒకటైన ఎన్టీఆర్-త్రివిక్రమ్ జోడీ, రెండు అగ్ర నిర్మాణ సంస్థలతో కలిసి వస్తుండటంతో ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. త్వరలోనే ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను, చిత్రీకరణ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు.

# ‘దూరదర్శని’ (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



ప్రేమకథలకు యూత్ లో మంచి క్రేజ్ ఉంటుంది. ఇక విలేజ్ నేపథ్యంలోని ప్రేమకథలకు మరింత ఆదరణ లభిస్తూ ఉంటుంది. అలాంటి ఒక ప్రేమకథగా ‘దూరదర్శని’ కనిపిస్తుంది. సువిక్షిత్ – గీతికా రతన్ జతగా నటించిన సినిమా ఇది. పబ్లిసిటీ పరంగా పెద్ద హడావిడి చేయకుండానే థియేటర్లకు వచ్చింది. అందువలన థియేటర్లలో నిలబడలేకపోయింది. మే 15వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, జూన్ 26వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. అది ఒక అందమైన పల్లెటూరు .. దాని పేరు ‘మట్టుపల్రు’. అక్కడ హరి (సువిక్షిత్) తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తూ ఉంటాడు. ఇంటర్ చదివిన హరి, పై చదువులకు పట్నం వెళ్లాలనే ఆశను చంపుకుంటాడు. ఎందుకంటే ఉన్నకొద్ది పొలాన్ని అమ్మేయడం అతనికి ఇష్టం ఉండదు. అందువలన ఊళ్లోని స్నేహితులతో కలిసి తిరుగుతూ ఉంటాడు. హరి తండ్రి రాజయ్య ఉన్న కొద్దిపాటి పొలాన్ని సేద్యం చేసుకుంటూ, పరశురామ్ దగ్గర పనిచేస్తుంటాడు. పరశు రామ్ శ్రీమంతుడు .. ఒక రకంగా చెప్పాలంటే ఆ ఊరు మోతుబరి. అతనంటే ఆ ఊళ్లో అందరికి భయమే. అందువల్లనే ఆయన చెల్లెలు వాణి (గీతికా రతన్) వైపు చూసే సాహసం ఎవరూ చేయరు. పట్నంలో చదువుకుంటున్న ఆమె, పరీక్షల తరువాత ఆ ఊరుకు వస్తుంది. అయితే తొలి చూపులోనే వాణిని చూసి హరి మనసు పారేసుకుంటాడు. ‘పేకబాబు’ ఇంట్లో ‘చిత్రలహరి’ చూడటానికి వచ్చిన హరి – వాణి ఇద్దరూ ప్రేమలో పడతారు. తన ఇంటికి ‘చిత్రలహరి’ చూడటానికి వస్తున్న వాణిని పేకబాబు కూడా ఇష్టపడతాడు. అయితే ఆమె హరితో సన్నిహిత్యంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతుంటాడు. కులమతాలపైనే పరువు ప్రతిష్ఠలు ఆధారపడి ఉంటాయని బలంగా నమ్మే ఆ ఊళ్లో, తమ ప్రేమ గెలవలేదనే విషయం ఆ జంటకు అర్థమైపోతుంది. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? ఆ తరువాత చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది మిగతా కథ. ప్రేమకి కులమతాలు .. ఆర్థికపరమైన స్థితిగతులు ఎప్పటికీ అడ్డుగోడలేనని చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కట్టుబాట్ల కారణంగా, ఈ అంతరాలు మరింత బలంగా కనిపిస్తూ ఉంటాయి. విలేజ్ నేపథ్యంలో ఒక పేదింటి అబ్బాయి .. కలవారి అమ్మాయికి మధ్య నడిచే ప్రేమకథలతో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. అలాంటి కథతో చేసిన మరో ప్రయత్నంగా ఈ సినిమా నిలుస్తుంది. హీరోయిన్ అన్నయ్య ఒక మోతుబరి .. ఒక రకంగా విలన్ షేడ్స్ తో భయపెట్టే రకం. ఇక అదే ఊళ్లో మరో డబ్బున్న యువకుడు .. అతను కూడా విలన్ షేడ్స్ ను కలిగినవాడే. హీరోయిన్ పై మనసు పారేసుకున్న ఈ డబ్బున్న దొరబాబు, ఆల్రెడీ హీరోయిన్ మనసు దోచుకున్న హీరోపై ద్వేషంతో ఉంటాడు. ఈ నాలుగు పాత్రల చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. ఇక హీరోయిన్ ను హీరో కలుసుకునేలా చేయడంలోనే తమ జీవితం ధన్యమైందని భావించే మిత్ర బృందం ఇందులోనూ కనిపిస్తుంది. కాకపోతే ఆ టీమ్ చేసే కామెడీ కాసింతైనా పండలేదు. ప్రధానమైన నాలుగు పాత్రలను బలంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంది. కానీ ఆ దిశగా అంత కసరత్తు జరగలేదనే విషయం అర్థమైపోతూనే ఉంటుంది. పాత్రలను సరిగ్గా డిజైన్ చేయకపోవడం వలన, సన్నివేశాలపై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వలన .. ఆశించినస్థాయి అవుట్ పుట్ లేకుండా తేలిపోతుంటాయి. రొటీన్ గా అనిపిస్తూ నిరాశపరుస్తూ ఉంటాయి.

# ‘జై భీమ్’ కాంబో రిపీట్.. కేజీఎఫ్ నిర్మాతతో సూర్య కొత్త సినిమా



మిళ స్టార్ హీరో సూర్య మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘జై భీమ్’ తర్వాత ఆయన మరోసారి దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో జతకట్టారు. ‘కేజీఎఫ్’, ‘కాంతార’, ‘సలార్’ వంటి పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్లను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడం విశేషం. ఈ సినిమా ముహూర్తపు వేడుకను సోమవారం (జూన్ 29) చెన్నైలో ఘనంగా నిర్వహించారు. సూర్య, హోంబలే ఫిల్మ్స్ కాంబినేషన్‌లో ఇదే తొలి చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో సూర్య సరసన హీరోయిన్‌గా కయాదు లోహర్ నటిస్తోంది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎస్.ఆర్. కతిర్ సినిమాటోగ్రాఫర్‌గా, ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా పనిచేయనున్నారు. కమర్షియల్ అంశాలతో కూడిన ఒక పవర్‌ఫుల్, గ్రిట్టి డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవలే రజనీకాంత్‌తో ‘వెట్టైయాన్’ సినిమాను తెరకెక్కించిన జ్ఞానవేల్, వెంటనే సూర్యతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. ఈ సందర్భంగా హోంబలే ఫిల్మ్స్, సూర్య మూడు దశాబ్దాల సినీ ప్రస్థానాన్ని, సినిమాల ఎంపికలో ఆయన నిర్భయ వైఖరిని ప్రశంసించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే శక్తివంతమైన, అర్థవంతమైన కథలను అందించాల న్నదే తమ ఉమ్మడి లక్ష్యమని నిర్మాత విజయ్ కిరగందూర్ పేర్కొన్నారు. ఇటీవలే ‘కరుప్పు’ చిత్రంతో విజయం అందుకున్న సూర్య, ఈ కొత్త ప్రాజెక్టుతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతు న్నారు. త్వరలోనే ఈ సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటించనున్నారు. కాగా, ఈ సినిమాపై హోంబలే ఫిల్మ్స్ ఓ ప్రకటన విడుదల చేసిందిసూర్యతో మా ప్రయాణం.. గర్వంగా ఉంది: హోంబలే ఫిల్మ్స్ “ఇది ఆయన నిర్మించుకున్న కెరీర్. ఫ్రేమ్ ఫ్రేమ్‌కూ, సినిమా సినిమాకూ, ఫైట్ ఫైట్‌కూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్నారు. ఎన్నో నిజ జీవితాల బరువును మోసే పాత్రలలో జీవించారు. ఆయన కెరీర్ ప్రతీసారీ సౌకర్యాన్ని కాదని, ధైర్యాన్ని ఎంచుకుంది. మూడు దశాబ్దాలుగా తెరపై సత్యాన్ని ఆవిష్కరిస్తూ, తెర వెనుక కోట్లాది హృదయాలను గెలుచుకున్నారు. ఈ తరం అత్యంత నిర్భయ నటుడు, ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత భారీ వేదికపైకి అడుగుపెడుతున్నారు. అలాంటి నటుడితో సినిమా చేసే అవకాశం మాకు దక్కింది. హోంబలే ఫిల్మ్స్ తరఫున ‘ది వన్ – సూర్య’కు మేము గర్వంగా స్వాగతం పలుకుతున్నాము. సూర్య గారితో మా ఈ ప్రయాణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూ స్తున్నాం. ఆయన నటన, మా నిర్మాణ విలువలు కలిసి ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తాయని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాము. ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధిం చిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం” అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




## రష్మిక చేతి ముద్రలతో దర్శకుడి షర్ట్.. ‘మైసా’ నుంచి క్రేజీ అప్డేట్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా’ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న రవీంద్ర పుల్లే తాజాగా సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. రష్మిక చేతి ముద్రలతో ఉన్న ఓ షర్ట్‌ను ధరించిన ఫొటోను షేర్ చేస్తూ.. “మైసాతో సంతకం చేయించుకున్నా. రక్తపు మరకలు రాబోతున్నాయి” అని వ్యాఖ్యానించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. దర్శకుడి పోస్ట్‌పై రష్మిక కూడా సరదాగా స్పందించారు. “మనం ఈ అందమైన కళలో కొంచెం రక్తం, పసుపు కూడా కలిపి ఉండాల్సింది! తర్వాతిసారి కచ్చితంగా చేద్దాం” అని కామెంట్ చేశారు. నిర్మాణ సంస్థ అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సైతం “మట్టిలో సంతకం.. రక్తంతో జ్ఞాపకం. ‘మైసా’ షూటింగ్ లో ఉంది. మునుపెన్నడూ చూడని రీతిలో భావోద్వేగాలను, ధైర్యాన్ని తెరపైకి తీసుకువస్తున్నాం. 2026లో సినిమా థియేటర్లలోకి వస్తుంది” అని ప్రకటించింది. ఈ చిత్రంలో రష్మిక ఓ గిరిజన యువతిగా కనిపించనున్నారు. ఈ పాత్రకు శారీరక దృఢత్వంతో పాటు భావోద్వేగాలను పండించే నటన కూడా ఎంతో అవసరం. అందుకే ఈ సినిమాలోని భారీ యాక్షన్ సన్నివేశాల కోసం రష్మిక తీవ్రంగా శ్రమించారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాంప్‌లో ఆమె రోజుకు 8 గంటలకు పైగా కఠినమైన స్టంట్స్, పోరాట విద్యల్లో శిక్షణ పొందారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449